సాక్షి నంద్యాల

సోమవారం । 13 । మార్చి । 2023



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఆదివారం 1,050 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 0.751 టీఎంసీల నీటి నిల్వ ఉండగా కేసీ కాల్వకు 705 క్యూసెక్కులు విడుదల చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధనలో భాగంగా ఆదివారం శ్రీశైల దేవస్థాన కళావేదికపై విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయం వారి ఆంధ్రనాట్యం కార్యక్రమం అలరించింది.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	19.06
గరిష్టం	36.0

న్యూస్‌రీల్

నేడు స్పందన కార్యక్రమం రద్దు

నంద్యాల: జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సందర్భంగా ఈ నెల13న (సోమవారం) 'స్పందన' కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావద్దని ఆయన సూచించారు.

బొమ్మలసత్రం: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు.

పది విద్యార్థులకు ప్రేరణా తరగతులు



విద్యార్థులతో అధికారిణి లక్ష్మీదేవమ్మ

నంద్యాల(సిటీ): జిల్లాలోని బీసీ వసతిగృహాల్లోని పదవ తరగతి విద్యార్థులకు ఒక్కరోజు ప్రేరణా తరగతులు నిర్వహించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిణి లక్ష్మీదేవమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో విద్యార్థులకు ప్రేరణాతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులలో నెలకొన్న పలు సందేహాలను నివృత్తి చేశామన్నారు. సుమారుగా 400 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

రానున్న రోజుల్లో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16 నుంచి 20 వరకు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు పొడి వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు 37 నుంచి 38 డిగ్రీల వరకు నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున కోతకు వచ్చిన మిరప పంటను వెంటనే కోసుకోవాలని సూచించారు.

'స్థానిక' ఓటర్లకు గుర్తింపు కార్డులు

కర్నూలు(అర్బన్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓటర్లుగా ఉన్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గుర్తింపు కార్డులను అందించినట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓటింగ్ సమయంలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే స్థానికంగా ఉన్న ఎంపీడీఓలు పరిష్కరిస్తారన్నారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, ఆత్మకూరు, డోన్‌లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా డివిజన్ల పరిధిలోని ఓటర్లు అక్కడకే వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లేందుకు ఆత్మకూరు ఉన్నత పాఠశాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



కొత్తపల్లి మండలం ముసలిమడుగు పోలింగ్ కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



ఎన్నికల సామగ్రిని తరలించే బస్సును పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నేడే ఎమ్మెల్సీ పోలింగ్

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహణ
- పకడ్బందీగా ఎన్నికల సామగ్రి తరలింపు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి



నంద్యాలలో పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది నియామకం, సామగ్రి తరలింపు తదితర ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 54,929 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 4,426 మంది, స్థానిక సంస్థల ఓటర్లు 578 మంది నేడు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీడీపీ నుంచి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి నగరూరు రామచంద్రారెడ్డి, వామపక్షాల ఉమ్మడి పీడీఎఫ్ అభ్యర్థి నాగరాజుయాదవ్‌తోపాటు మొత్తం 49 మంది బరిలో ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ స్థానం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పీడీఎఫ్ అభ్యర్థిగా, వైఎస్సార్‌సీపీ మద్దతుతో రామచంద్రారెడ్డి, టీడీపీ మద్దతు తో ఒంటేరు శ్రీనివాసరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డితోపాటు మొత్తం 12 మంది బరిలో ఉన్నారు. కర్నూలు స్థానిక సంస్థల బరి నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున డాక్టర్ ఏ మధుసూదన్‌తోపాటు మరో ఇద్దరు స్వతంత్రులు పోటీలో నిలిచారు. వీరి భవితవ్యం ఈనెల 16న నిర్వహించే ఓట్ల లెక్కింపుతో తేలిపోనుంది.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది..

సోమవారం పోలింగ్ ప్రక్రియ నేపథ్యంలో ఆదివారం ఎన్నికల సామగ్రిని తరలించారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి జంబో బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లు తదితర సామగ్రిని ఆయా రూట్లలో కేటాయించిన ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. అలాగే ఆత్మకూరులో ఆర్డీఓ దాస్ ఆధ్వర్యంలో, డోన్‌లో ఆర్డీఓ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు నియమించిన సిబ్బంది సామగ్రిని వెంట తీసుకెళ్లారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను పకడ్బందీ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు మొత్తం 94 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మంచినీరు, నిరంతర విద్యుత్, అవసరమైన కుర్చీలు, టేబుళ్లు, బారికేడ్లతోపాటు అవసరమైన టెంట్లను ఏర్పాటు చేశారు. 9 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి వాటిలో వెబ్ కాస్టింగ్‌తోపాటు వీడియోగ్రాఫర్లను అందుబాటులో ఉంచారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

విధుల్లో వెయ్యి మందికి పైగా..

ఎన్నికల పోలింగ్ నిర్వహణలో జిల్లాలో వెయ్యి మందికి పైగా అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. పోలింగ్ ప్రక్రియకు 473 మంది అధికారులను నియమించారు. ఇందులో పీఓలు 118 మంది, ఏపీఓలు 118 మంది, ఓపీఓలు 237 మంది, మైక్రో అబ్జర్వర్స్ 118 మంది, రూట్ అధికారులు 15 మంది, సెక్టోరల్ అధికారులు 15 మందిని నియమించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఏడు బృందాలు, ఎంసీసీ స్క్వాడ్ అధికారులతో 29 టీంలు నియమించి ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. జిల్లా ఎస్పీ రూట్ మొబైల్స్, చెక్‌పోస్టులు, పికెట్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్యూఆర్ టీమ్స్, పోలింగ్ స్టేషన్ వద్ద పోలీసు బందోబస్తుగా 590 మంది సిబ్బందిని నియమించారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పోలింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రి, సిబ్బంది తరలింపు ప్రక్రియను ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల్లో జంబో బ్యాలెట్ బాక్సులు అమర్చే విధానంతో పాటు పోలింగ్ సిబ్బంది తరలింపు ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నుంచి జిల్లా వ్యాప్తంగా మూడు డివిజన్లలోని పోలింగ్ కేంద్రాల్లో చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ స్థానం పేరు	ఓటర్ల సంఖ్య	పోలింగ్ కేంద్రాల సంఖ్య	బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య
పట్టభద్రులు	54,929	61	49
ఉపాధ్యాయులు	4,426	30	12
స్థానికసంస్థలు	578	3	3



అశేష భక్తజనం మధ్య సాగుతున్న బంగారు రథయాత్ర

కనుల పండువగా మధ్యారాధన

మంత్రాలయం: శ్రీమఠం పూర్వపు పీఠాధిపతి, మంత్రాలయ నవ నిర్మాణ శిల్పి సుయతీంద్రతీర్థుల మధ్యారాధన వేడుకలు ఆదివారం కనులపండువగా జరిగాయి. పీఠాధిపతి సుభుదేంద్రతీర్థుల నేతృత్వంలో వేడుకలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ముందుగా సుయతీంద్రతీర్థుల మూల బృందావనానికి నిర్మల్య విసర్జన, విశేష పంచామృతాభిషేకం చేసి మహా మంగళహారతులు పట్టారు. అనంతరం ఊంజల మంటపంలో గురుసార్వ భౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులచే యజుర్వేద పారాయణ మంగళ కార్యక్రమం నిర్వహించారు. శ్రీమఠం ప్రాకార వీధుల్లో బంగారు రథంపై సుయతీంద్రతీర్థుల చిత్రపటాన్ని అంగరంగ వైభవంగా ఊరేగించారు. మహిళా భక్తుల గేయాలాపనలు, హరిదాసుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మది నిండుగా.. పార్టీ పండుగ

- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్న పార్టీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

నంద్యాల: జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మిన్నంటాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పార్టీ సేవలను కొనియాడారు. ఆదివారం జిల్లా కేంద్రం నంద్యాల పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండా ఎగురవేసి అనంతరం కేక్ కట్ చేసి, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. విలువలు, విశ్వసనీయతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుపేరు అన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే నాయకులు, కార్యకర్తలకు జగనన్న న్యాయం చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, కల్లూరు రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

➡ నందికొట్కూరు నియోజకవర్గంలో పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో తిరుగులేని పార్టీగా నిలిచిందన్నారు.

➡ ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ పేదల పక్షమేనన్నారు.

➡ నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి స్వగృహంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు.

➡ ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీశైల నియోజకవర్గ పరిశీలకుడు తెర్నేకల్ సురేంద రెడ్డి, కన్వీనర్ శిల్పా భువనేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు అన్ని రంగాల్లో న్యాయం చేసిన పార్టీ వైఎస్సార్‌సీపేనని సురేంద్రారెడ్డి పేర్కొన్నారు.

➡ డోన్‌లో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో వేడుకలు ఘనంగా చేపట్టారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాములు, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డిలు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

➡ బనగానపల్లెలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా ఎగురవేసి అనంతరం కేక్ కట్ చేసి, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈ పాపం ఎవరిది?

- పులి కూనల పునరేకీకరణ వైఫల్యాలకు కారణాలు ఎన్నో
- జూపార్క్ ఎన్‌క్లోజర్‌లో సహజ ఎదుగుదలపై ప్రభావం
- వేటపై పులి పిల్లలకు శిక్షణ సాధ్యమేనా?



పులి కూనలను జూకు తరలిస్తున్న వైద్యులు (ఫైల్)



నల్లమల అడవిలో తల్లి పులి ఆచూకీ కోసం వెతుకుతున్న అటవీ అధికారులు (ఫైల్)

ఆత్మకూరు రూరల్: కర్ణుడి చావుకు వంద కారణాలన్నట్లుగా నల్లమలలో తల్లి పులి నుంచి తప్పిపోయిన కూనలను తిరిగి తల్లి వద్దకు చేర్చే ప్రక్రియ విఫలం కావడానికి ఎన్నో కారణాలు కనిపిస్తున్నాయి. తల్లి చాటున సహజంగా వేట నేర్చుకుని నల్లమల అభయారణ్యంలో పంజా విసరాల్సిన పులి కూనలు జూపార్క్ ఎన్‌క్లోజర్లలో శిక్షణ తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. వారం రోజుల క్రితం నల్లమలలో పులి కూనల పునరేకీకరణ యత్నం విఫలమయ్యేందుకు అటవీ అధికారుల అభద్రతాభావమేనని స్పష్టంగా కనిపిస్తోంది. పర్యావరణ పిరమిడ్‌లో అగ్రసూచి అయిన పులి సంరక్షణ అత్యంత కీలకం. ఈ విషయంలో అటవీ శాఖ ఎంతో బాధ్యతాయుతమైన విధి నిర్వహణగా పరిగణిస్తోంది. ఇందులో విఫలమైన అధికారులు పూర్తిగా బాధ్యత వహించాల్సి వస్తోంది. ఈ భయంతోనే పులి కూనలను తల్లి వద్దకు చేర్చడంలో ఎలాంటి రిస్క్ తీసుకోలేదని తెలుస్తోంది. పిల్లలను అందుబాటులో ఉంచి తల్లి చెంతకు చేరేలా చేయాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించారు. ముందు పులిని వెతికి ఆ తరువాత పిల్లలను దాని వద్దకు చేర్చాలనే ప్రమాద రహిత, నింపాది చర్యలకు ప్రాధాన్యత నిచ్చారు. పులి సంరక్షణలో ఎంతో అనుభవమున్న హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హెటికోస్)సభ్యులు ఈ పద్ధతిపై విమర్శలు చేస్తున్నారు. సుమారు 2 కి.మీ వలయం పరిధిలో తన కూనలతో పెద్దపులి పర్యవేక్షణ చేయగలదు. అయితే కూనలు కొద్దిగా నీరసించి పోవడంతో వాటికేమైనా అవుతుందేమోన్న భయంతో అధికారులు ప్రమాద రహిత మార్గంలో యత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. తొలిరోజున పెద్ద గుమ్మడాపురం సమీపంలో తల్లి పులి టీ108 గాండ్రింపులు వినపడ్డాయి. అలాగే సమీపంలో పులి పాదముద్రలు కనిపించాయి. సమీపంలోని ముసలిమడుగు గ్రామ సమీపంలో రోడ్డు దాటుతూ పులి కనిపించింది. అక్కడికి పులికూనలను తీసుకు వెళ్లి తల్లి కోసం ప్రయత్నించి ఉంటే తల్లి ఒడి చేరే అవకాశాలు ఎక్కువగా ఉండేది. మీడియా కారణంగా పులి కూనల విషయం వెలుగులోకి రావడం, గుమ్మడాపురం గ్రామస్తులే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అలాగే కొందరు మీడియా ప్రతినిధులు అటవీ ప్రాంతంలో సంచరించడంతో ఆ అలికిడికి తల్లి పులి ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోడంతో కూనలు తిరుపతి జూకు తరలించాల్సి వచ్చిందని చెప్పవచ్చు.

పులి కూనలు పంజా విసిరేదెలా..!

పులి కూనలు ఏకారణంగానైనా జూలో పరాన్నజీవిగా మారితే ఇక అవి కనీసం కోడి పిల్లను కూడా వేటాడే శక్తిని కూడా కోల్పోతాయి. ఎన్‌టీసీఏ మార్గదర్శకాల మేరకు నాలుగు పులి కూనలను తిరుపతి జూకు తరలించారు. అయితే ఇన్–సీటు ఎన్‌క్లోజర్‌లో ఉంచిన పులికూనలు కౌమార దశకు రాగానే అక్కడ సహజ ఆవరణలోనే వాటికి వేట నేర్పి ఆపై అడవిలో వదిలేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే వేటపై శిక్షణ సాధ్యమేనా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక వేళ అలా ప్రయత్నించినా అడవుల్లో అత్యంత వేగంగా పరిగెత్తి గడ్డితినే వన్య ప్రాణులను జూ పోషిత పులులు వేటాడలేక ఆహారం కోసం సమీప గ్రామాల్లోకి వచ్చే ప్రమాదం ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పెద్దపులికి ఘ్రాణ శక్తి అపారం

పెద్దపులికి వాసనను గుర్తించే శక్తి అమోఘం. ఒక రకంగా పులి వాసనలను గుర్తించడం ద్వారా తన వేట, తన రక్షణను మొత్తం మీద జీవన విధానాన్నే రూపొందించుకుంటుంది. తన కూనలను వదిలి వేటకు వెళ్లినపుడు గరిష్టం రెండు కి.మీ. పరిధి నుంచి కూడా వాటితో సంబంధం కలిగి ఉంటుంది. తనదైన తరంగ దైర్ఘ్యంలో శబ్దాలు చేస్తూ కూనలను పర్యవేక్షించగలదు. అందుకే సాధారణంగా కూనలు తల్లి పులితో ఎప్పుడూ తప్పి పోవు.

– ఇమ్రాన్ సిద్దిఖీ, డైరెక్టర్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హెటికోస్)

క్లుప్తంగా

హోటళ్ల యజమానులను బెదిరిస్తున్నారు


మాట్లాడుతున్న సముద్రాల హనుమంతరావు

కర్నూలు (అర్బన్): ఇటీవల కాలంలో పలువురు నకిలీ అధికారులు తాము ప్రభుత్వం నుంచి వచ్చామని చెబుతూ హోటళ్ల యజమానులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కర్నూలు హోటల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సముద్రాల హనుమంతరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సేల్స్ ట్యాక్స్ ఆఫీసర్, విజిలెన్స్ శాఖ నుంచి వచ్చామంటూ హోటళ్లలో దాడులు నిర్వహిస్తున్నారని చెప్పారు. తినుబండారాలు నాణ్యతతో లేవని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని మీపై కేసులు నమోదు చేస్తామని హోటళ్ల నిర్వాహకులకు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక నుంచి నకిలీ అధికారులెవరైనా హోటళ్లకు వచ్చి ప్రశ్నిస్తే మర్యాదగా కూర్చోబెట్టి అసోసియేషన్ వారికి ఫోన్ చేయాలని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కల్కూర మురళి, కువ్వాడి రామకృష్ణ, కోశాధికారి వినయ్, ఉపాధ్యక్షులు వెంకటేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో తెలంగాణ హైకోర్టు జడ్జి


న్యాయమూర్తి నవీన్‌రావుకు రాఘవేంద్రుల జ్ఞాపిక అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం : ప్రముఖ రాఘవేంద్రస్వామి దర్శనార్థం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నవీన్ రావు బుధవారం కుటుంబ సమేతంగా మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు శేషవస్త్రం, విశేష మాల, రాఘవేంద్రుల జ్ఞాపిక అందజేసి ఫల, పూల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు. ఆయనతో పాటు మఠం మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఉన్నారు.

ఇద్దరిపై పీడీయాక్టు నమోదు

బొమ్మలసత్రం: పాణ్యం, మహానంది మండలాల్లో గూండాగిరికి పాల్పడుతున్న ఇద్దరిపై జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం పీడీయాక్టు నమోదు చేశారు. పాణ్యం మండల కేంద్రానికి చెందిన రాపూరి ఏడుకొండలు, మహానంది మండలానికి చెందిన రాపూరి ప్రసాద్ కొంత కాలంగా ప్రజలపై రౌడీయిజానికి పాల్పడుతున్నారు. అలాగే అక్రమంగా నాటుసారా, మద్యం విక్రయిస్తుండగా వీరిపై పీడీయాక్టు నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు.


బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది


విధుల వివరాలు తెలుసుకుంటూ..


ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి వచ్చిన సిబ్బంది


బ్యాలెట్ పేపర్లను సరి చూసుకుంటూ..

తరలిన యంత్రాంగం

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం తరలి వెళ్లింది. కర్నూలులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఆదివారం సందడిగా కనిపించింది. బ్యాలెట్ బాక్సులు, పేపర్లు, ఇతర పోలింగ్ సామగ్రిని తీసుకొని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో ఎన్నికల సిబ్బంది బయలుదేరారు. – సాక్షి ఫొటోగ్రాఫర్


బ్యాలెట్ బాక్సులకు తాళాలు వేస్తూ..



పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తూ..

సామాజిక చైతన్యమే లక్ష్యంగా రచనలు

- సాధన నవల ఆవిష్కరణలో సాహితీ వేత్తలు


సాధన నవలను ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సామాజిక చైతన్యమే లక్ష్యంగా రచనలు ఉండాలని పలువురు సాహితీ వేత్తలు అన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన రచయిత డాక్టర్ శాంతి నారాయణ రచించిన సాధన నవల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం కర్నూలులోని కళాక్షేత్రంలో జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణ స్వామి, ప్రముఖ కవులు హెచ్‌ఆర్కే, వెంకట కృష్ణ, నాగేశ్వరాచారి నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి నారాయణ స్వామి మాట్లాడుతూ గాయపడిన నేల అన్న ఉపశీర్షికతో సాగిన ఈ సాధన నవల రాయలసీమ సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. వర్తమాన పరిస్థితుల్లో అవసరమైందన్నారు. రాయలసీమలో ఏయే ప్రాంతం ఏ విధంగా పాలకుల నిర్లక్ష్యానికి బలైందో ఏ జిల్లాను ఏవిధంగా మోసం చేశారో సమగ్రమైన ఆధారాలతో ఈ నవల రూపుదిద్దుకుందన్నారు. హెచ్‌ఆర్కే మాట్లాడుతూ పుస్తకాన్ని చదివే ప్రతి పాఠకుడు రచయితేనన్నారు. రాయలసీమలో సాహిత్యం కొత్తపుంతలు తొక్కుతోందన్నారు. సాధన నవల రాయలసీమ నీటి సమస్యను ప్రస్ఫుటంగా చూపటమే కాక అనేక ప్రశ్నల్ని లేవనెత్తిందన్నారు. అనేక చారిత్రక విషయాలను చెబుతూనే మన కళ్లముందు వర్తమాన స్థితిని తేటతెల్లం చేసిందన్నారు. కవి నాగేశ్వరాచారి నవలను పరిచయం చేస్తూ రాయలసీమ అస్తిత్వాన్ని నీళ్లను కన్నీళ్లతో తడుపుతుందన్నారు. రాజకీయ రాబందులు చేసే మోసాలను రచయిత సృజనాత్మకతంగా చెప్పారన్నారు. నవలా రచయిత డాక్టర్ శాంతి నారాయణ మాట్లాడుతూ నవల రచనకు ప్రధాన కారణం సీమ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలే అన్నారు. కవులు, రచయితలు మారుతి, ఇనాయతుల్లా, జంధ్యాల రఘుబాబు, ఎస్‌డీవీ అజీజ్, ఏవీ రెడ్డి, పఠాన్ సుల్తాన్‌ఖాన్, జహీర్ అహ్మద్, చక్రపాణి యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

తిరుమల గ్రీన్ సిటీ వెంచర్ ప్రారంభం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, తిరుమల గ్రీన్‌సిటీ ఎండీ బీకేసింగ్

పాణ్యం: మండల పరిధిలోని కౌలూరు గ్రామ పరిధిలో కొత్తగా తిరుమల గ్రీన్ సిటీ వెంచర్ ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తిరుమల గ్రీన్ సిటీ ఎండీ బీకే సింగ్ గతంలో అనేక వెంచర్లను, గృహాలను నిర్మించారన్నారు. కౌలూరు వద్ద ఏర్పాటు చేసిన కొత్త వెంచర్‌లోనూ నాణ్యతతో కూడిన గృహాలు నిర్మించి కస్టమర్ల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కుడా అనుమతితో ఏర్పాటు చేస్తున్న ఈ లేఅవుట్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. అలాగే కౌలూరు, నెరవాడ గ్రామాల ప్రజలకు ఈ కొత్త వెంచర్‌లో తక్కువ ధరకు ప్లాట్లు అందించాలని కోరారు. కౌలూరు, నెరవాడ గ్రామాలను అనుసంధానం చేసేందుకు జుర్రవాగుపైన రూ.60 లక్షలతో బ్రిడ్జి నిర్మించేందుకు బీకే సింగ్ ముందుకు రావడం అభినందించదగ్గ విషయమని ఎమ్మెల్యే కాటసాని కొనియాడారు. అనంతరం వారు బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, తిరుమల గ్రీన్‌సిటీ ఎండీ బీకే సింగ్, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, నెరవాడ సర్పంచ్ లింగాల శారదమ్మ, కొండజూటూరు సర్పంచ్ ఎస్. సుజీత్‌రెడ్డి, శివారెడ్డి, బాలయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఊయలే ఉరితాడై

- గొంతుకు బిగుసుకొని బాలిక మృతి
- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- తూడిచెర్ల గ్రామంలో ఘటన


మృతిచెందిన భవ్య(ఫైల్)

జూపాడుబంగ్లా: ఆడుకుంటున్న ఊయలే బాలిక పాలిట ఉరితాడైంది. మండలంలోని తుడిచెర్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన హనుమాన్‌సింగ్, వరలక్ష్మి దంపతులకు భవ్య (11), లోకేష్ సంతానం. భవ్య కనకయ్య కొట్టాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతుంది. ఆదివారం సెలవుదినం కావటంతో తల్లి పొలం పనులకు వెళ్లగా తండ్రి నంద్యాలకు పనిపై వెళ్లాడు. తమ్ముడు లోకేష్ ఆడుకోవటానికి బయటకు వెళ్లాడు. ఇంట్లో ఉన్న భవ్య మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంట్లో (రేకుల కొట్టం) టీవీ చూసుకుంటూ చీరతో కట్టిన ఊయలలో కూర్చొని ఊగుతుంది. ఈ క్రమంలో చీర మెడకు బిర్రుగా బిగుసుకుపోవడంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కొద్దిసేపటి తర్వాత బాలిక పెద్దనాన్న కొడుకు వచ్చి చూడగా భవ్య ఊయలలో కదలకుండా కనిపించింది. అనుమానంతో పరుగున వెళ్లి చుట్టుపక్కల వారిని, బంధువుల సాయంతో బయటకు తీసి చూడగా అప్పటికే ప్రాణాలు విడిచింది. బిడ్డ మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్తులు తండోపతండాలుగా వచ్చి భవ్య మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.


భవ్య మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి వరలక్ష్మి

మహానందీశ్వరాలయంలో పాము కలకలం

మహానంది: మహానంది దేవస్థానంలో ఆదివారం పాము కలకలం రేపింది. స్వామి గర్భాలయం ముందు, పెద్దకోనేరు చుట్టూ రక్షణగా ఇనుప కటాంజనం ఉంది. ఈ గ్రిల్‌కు పాము చుట్టుకుంది. ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది, దర్శనానికి వచ్చిన భక్తులు చూసి భయాందోళనకు గురయ్యారు. స్థానిక సిబ్బంది వెంటనే పాములు పట్టే కోటకొండ రాముడుకు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశాడు.


పామును పట్టుకున్న కోటకొండ రాముడు


గర్భాలయం ముందు కటాంజనంలో పాము

పరీక్షలపై భయం వీడాలి

కర్నూలు సిటీ: పదవ తరగతి విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని డీఈఓ ఆఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాముల్ పాల్ అన్నారు. ఆదివారం కర్నూలు మండల పరిధిలోని జి.శింగవరం జెడ్పీ హైస్కూల్, నగరంలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల(పాతబస్టాండ్), ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల (కింగ్ మార్కెట్)లలో జరుగుతున్న పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. అలాగే ఒత్తిడిలో ఆరోగ్యాన్ని విస్మరించరాదన్నారు. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షలు ముగిసేంత వరకు టీవీ, సెల్‌ఫోన్, తదితర వాటికి దూరంగా ఉండాలని, ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవాలన్నారు. పరీక్షల సన్నద్ధత, పరీక్షలు రాసే విధానంపై ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు.


కింగ్ మార్కెట్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఏడీ

స్కూటర్ అదుపుతప్పి..


మారుతి రావు (ఫైల్)

ఆలూరు రూరల్: స్కూటర్ అదుపుతప్పి కిందపడిన సంఘటనలో విద్యుత్‌శాఖ ఉద్యోగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆలూరు విద్యుత్ డీఈఈ కార్యాలయంలో మారుతి రావు (43) సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆదోనిలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఆలూరు విద్యుత్ డీఈఈ ఆఫీసు నుంచి తపాలా కవర్ తీసుకుని సాయంత్రం ఆదోనికి బయలుదేరాడు. జాతీయ రహదారి మరమ్మతుల్లో భాగంగా ఆలూరు సమీపంలోని బెళ్లెగుండు ఆంజనేయ స్వామి ఆలయ ముఖద్వారం వద్ద కంకర కుప్ప వేశారు. దీనిని తప్పించే క్రమంలో స్కూటర్ అదుపుతప్పడంతో ఆయన కింద పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మారుతి రావుకి భార్య అనురాధ, కుమారుడు కపిల్ నారాయణ్, కూతురు మేఘన ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆలూరు ఎస్‌ఐ డాక్టర్ నాయక్ విలేకరులకు తెలిపారు.

బొజ్జలో బకాసురులు!

- పిల్లలు తిన్నదంతా తినేసే నులిపురుగులు
- దీంతో శారీరక, మానసిక ఎదుగుదలలో లోపం
- రక్తహీనత, బరువు తగ్గిపోవడం
- నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చర్యలు
- రేపు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు అందజేత
- జిల్లాలో 6,23,222 మంది పిల్లల గుర్తింపు

మన ఇళ్లల్లో చాలా మంది పిల్లలు ఎంత తింటున్నా బక్కచిక్కినట్లుగా కనిపిస్తారు. తరచూ కడుపునొప్పి అని చెప్పడం..మలవిసర్జన ద్వారం వద్ద చేతులు పెట్టడం చేస్తుంటారు. మరికొందరు ముఖంలో రక్తం లేనట్లు పాలిపోయినట్లు కనిపిస్తూ ఉంటారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వారి కడుపులో నులిపురుగులు ఉన్నట్లు అనుమానించి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి. లేకపోతే పిల్లల ఆరోగ్యంపై అవి తీవ్ర ప్రభావం చూపుతాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. రేపు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్):జిల్లాలో 1,886 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,334 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ఆయా విద్యాసంస్థల్లో మొత్తం 6,23,222 మంది విద్యార్థులున్నట్లు అంచనా. ఇక్కడ చదివే ఒకటి నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులకు ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్–400 మి.గ్రా. మాత్రలో సగం, 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి ఒక మాత్ర నమిలించి మింగించనున్నారు. ఇందుకు పాఠశాల, కళాశాల విద్య, ఎస్‌ఎస్‌ఏ, ఐసీడీఎస్, అనియత విద్య, వికలాంగుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, సాంఘిక సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖల సహకారం తీసుకుంటున్నారు.

నులిపురుగులు వ్యాపించే విధానం

నులిపురుగులు ఉన్న వ్యక్తి మల విసర్జన ద్వారా గుడ్లు నేలలోకి, తద్వారా తాగునీరు, గాలి ద్వారా ఆహార పదార్థాలపై చేరతాయి.



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న అధికారులు(ఫైల్)

నులిపురుగుల వ్యాధి లక్షణాలు

ఆకలి తగ్గిపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, పోషకాహారలోపం, రక్తహీనత, తరచుగా ఇన్‌ఫెక్షన్లకు గురికావడం, నీరసం, ఆందోళన, బరువు తగ్గిపోవడం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం
- చేతి గోళ్లను వారానికి ఒకసారి కత్తిరించుకోవడం
- వండిన ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టడం
- కూరగాయలు, పండ్లు మొదలైన వాటిని వండటానికి ముందు శుభ్రంగా కడగటం
- ఎప్పుడూ శుభ్రమైన నీటినే తాగడం
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం
- మలవిసర్జనకు మరుగుదొడ్డి ఉపయోగించడం
- బయట తిరిగేటప్పుడు పాదరక్షలు ధరించడం


నులిపురుగుల నిర్మూలనతో ప్రయోజనాలు

- పిల్లలో రక్తహీనతను నివారిస్తుంది
- పోషకాలను శరీరం గ్రహించుకుని ఎదుగుదల జరుగుతుంది
- చదువుపై ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది. తద్వారా అంగన్‌వాడీ/పాఠశాల/కళాశాలలకు వెళ్లేందుకు ఆసక్తి పెరుగుతుంది.
- పనిచేయగలిగే సామర్థ్యం పెరుగుతుంది.

మాత్రలు మింగించాలి

పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలి. ఈ మాత్రలు మింగడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. దీనివల్ల పిల్లలకు మరింత మేలు జరుగుతుంది. వారి ఆరోగ్యం బాగవుతుంది. కడుపులోని నులిపురుగులు నశించి వారు తిన్నది ఒంటపడుతుంది. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుంది. ఎలాంటి ఆందోళన పెట్టుకోకుండా ప్రతి తల్లిదండ్రులు మధ్యాహ్నం భోజనం తర్వాత పిల్లలు ఈ మాత్రలు మింగేలా ప్రోత్సహించాలి. ఇదే సమయంలో పిల్లలతో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించనున్నాము.
– డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో

నులిపురుగులతో ఆరోగ్య సమస్యలు



పిల్లల కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల వారి రక్తంలో ఐరన్‌శాతం తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. బలహీనంగా ఉండటం, ఆందోళన, కడుపునొప్పి, మలబద్ధకం లక్షణాలు కూడా కనిపిస్తాయి. పిల్లలు ఎక్కువగా మట్టిలో ఆడుకోవడం, చేతులు సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం వల్ల వారి కడుపులో నులిపురుగులు చేరతాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు రెగ్యులర్‌గా ప్రతి ఆరు నెలలకు ఒకసారి రెండేళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్ర 200ఎంజీ ఒకటి, రెండు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు 400 ఎంజీ మాత్ర ఒకటి మింగించాలి. బాల్యం నుంచే చేతుల శుభ్రతపై అవగాహన పెంచాలి.
– డాక్టర్ వి. వీరరత్నాకర్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్యులు, కర్నూలు

జీవన దస్తూరి

తమ రాతతో సమస్యను ప్రతిబింబిస్తారు.. క్లుప్తంగా సమస్యనంతా అక్షరీకరించడంలో వారు నిపుణులు.. అర్జీ ఏ అధికారి వద్దకు వెళ్తుందో గ్రహించి వారి తీరుకు అనుగుణంగా రాయడం వారి నేర్పరితనం.. ఈ రాతే వారి కడుపులు నింపుతోంది. తమ సమస్యగా భావించి అర్జీలు రాసి ఉపాధి పొందుతున్నారు లేఖరులు.

- అర్జీలు రాస్తూ ఉపాధి పొందుతున్న నిరుద్యోగులు
- బాధితుల సమస్యలను తమవిగా భావించి రాస్తున్న వైనం
- జిల్లాలో వందలాది మందికి జీవనాధారం
- ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో విధులు


కలెక్టర్ కార్యాలయం వద్ద అర్జీలు రాస్తున్న రైటర్లు

నంద్యాల(అర్బన్): మహారాజశ్రీ.. తహసీల్దార్ గారికి నమస్కరించి రాయునది ఏమనగా... అంటూ ఎంతో మంది సమస్యలను వారి సమస్యలుగా ఊహించుకొని రాసే అర్జీలు వారి జీవితాల్లో వెలుగులు నింపుతూ ఉపాధి చూపుతున్నాయి. వారి చేతులతో రాసే అర్జీలతో ఉన్నాధికారులకు, ప్రజా సమస్యలు కూలంకషంగా అర్థమయ్యేలా ఉంటాయి. జిల్లా కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణల్లో ఆదివారం మినహా వందలాది మందికి ఈ వృత్తే ఆధారం. స్పందన కార్యక్రమ రోజుల్లో మాత్రం ఆదాయం కొంత మెరుగ్గా ఉంటుంది. నంద్యాల జిల్లాతో పాటు పలు మండల కార్యాలయాల వద్ద ఎన్నో ఏళ్లుగా వందల సంఖ్యలో అర్జీ రైటర్లుగా పనిచేస్తున్నారు.

రాత.. పరిష్కారం చూపుతోంది..

జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు వినతులు ఇచ్చేందుకు వందల సంఖ్యలో ప్రజలు నంద్యాల కలెక్టరేట్‌తో పాటు పలు మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు ప్రజలు వస్తుంటారు. ఇందులో వృద్ధులు, యువకులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఉంటారు. వీరిలో ఎంతో మంది చదువుకున్న వారు, చదువుకోని వారు ఉంటారు. అయినా ప్రతి ఒక్కరూ వారికున్న సమస్యలను ఉన్నతాధికారులకు చెప్పాలంటే ముందుగా అర్జీ రాసుకోవాలి. చదువుకున్న వారు అర్జీ రాయడంపై అవగాహన ఉంటే తమ అర్జీలను తామే రాసుకుంటారు. ఇలా అర్జీలు సొంతంగా రాసుకొనే వారు 30 శాతానికి మించి ఉండరు. మిగిలిన 70 శాతం మందిలో 50 శాతం వరకు నిరక్షరాస్యులు. వీరు తమ సమస్యను మౌఖికంగా చెప్పడానికి వెళ్తే అధికారులకు అర్థం గాక వివరంగా రాసుకొని రండి అంటూ సూచిస్తున్నారు. దీంతో తమ సమస్యను అక్షర రూపంలో మలిచేందుకు అర్జీ రైటర్లను ఆశ్రయిస్తున్నారు. వారు వారి సమస్యను తమ సమస్యగా భావించి ఉన్నతాధికారులకు త్వరగా అర్థమయ్యేలా రాసి ఇస్తారు. అంతేగాక ఆ సమస్యను ఏ అధికారి దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతుందో, వాటికి జత పరచాల్సిన ధ్రువ పత్రాల గురించి కూడా సలహా ఇస్తారు. అలాగే.. సమస్య పరిష్కారం కాకపోతే ఎదురయ్యే ఇబ్బందులనూ వివరిస్తారు.

చెట్ల నీడనే విధులు..

కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రతి రోజు దాదాపు 10 మంది అర్జీ రైటర్లు ఉంటారు. సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుండటంతో 20 మంది వరకు ఉంటారు. నంద్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం 15 మంది అర్జీ రైటర్లు ఉంటారు. వీరంతా వరండాలు, చెట్ల నీడనే తమ విధులు నిర్వర్తిస్తుంటారు. ఒక అర్జీ రాయడానికి రూ.50 నుంచి వసూలు చేస్తారు. కొన్ని సార్లు అర్జీని బట్టి అధిక మొత్తం కూడా తీసుకుంటారు.

ఉపాధి కోసం...

'నా పేరు ముత్యాల పాటి వసుంధరాదేవి. బీఏ బీఈడీ పూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నంలో అదృష్టం కలిసిరాక ప్రైవేటు పాఠశాలలో దాదాపు పదేళ్లు పని చేశా. అక్కడ వారిచ్చే వేతనం సరిపోక పోవడంతో.. అక్షరాలు గుండ్రంగా ఉంటాయి, అర్జీ రైటర్‌గా వెళ్లవచ్చు కదా.. అని స్నేహితురాళ్లు ఇచ్చిన సలహా మేరకు మొదట కర్నూలు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రెండేళ్లు దరఖాస్తులు రాశా. కుటుంబ సభ్యులు నంద్యాలలో ఉండటంతో ఇక్కడికి వచ్చి మూడేళ్ల క్రితం నుంచి అర్జీలు రాస్తూ ఉపాధి పొందుతున్నా. ప్రతి రోజూ రూ.500 నుంచి రూ.700 దాకా సంపాదన ఉంటుంది. స్పందన రోజు రూ.వెయ్యి వరకు వస్తుంది. నా ఆదాయం కుటుంబానికి ఆసరాగా ఉంటోంది.'



కంప్యూటర్ ఆపరేటర్ వేతనం చాలక..

'నా పేరు హుసేన్ జమీల్‌బాషా. కోవెలకుంట్ల పట్టణంలో ఉంటున్నా. బీఎస్సీ చదివి కంప్యూటర్ కోర్సు పూర్తి చేశా. పదేళ్ల పాటు కర్నూలు ఐసీడీఎస్ ప్రాజెక్టులో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించా. వారిచ్చే రూ.6వేల వేతనం ప్రయాణం, సొంత ఖర్చులకు సరిపోయేది కాదు. ఆపరేటర్‌గా ఉన్న సమయంలో అర్జీలు రాయడం అలవాటైంది. దీంతో అర్జీలు రాసి ఉపాధి పొందాలనే ఆలోచన వచ్చింది. నంద్యాల కొత్త జిల్లా కావడంతో కలెక్టర్ కార్యాలయం వద్ద అర్జీ రైటర్‌గా ఉంటున్నా. ప్రతి రోజూ రూ.500 వరకు సంపాదన ఉంటుంది. స్పందన కార్యక్రమం రోజు రూ.800 వరకు వస్తుంది.'



క్లుప్తంగా

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

నంద్యాల(అర్బన్): నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో అకారణంగా తొలగించిన శానిటేషన్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. కార్మికుల తొలగింపు అన్యాయమంటూ ఆదివారం శానిటేషన్ కార్మికులతో కలిసి ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, అధికారులే ఇందుకు బాధ్యులని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. శానిటేషన్ వర్కర్లు సుశీలమ్మ, వెంకటరమణమ్మ, నాగేంద్రమ్మ, సావిత్ర, రాణి పాల్గొన్నారు.

శ్రీ కృష్ణదేవరాయలుకు నివాళి


ఉయ్యాలవాడలో రాయలవారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

ఉయ్యాలవాడ : స్థానిక కమతం వీధిలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణదేవరామయలు విగ్రహానికి ఆదివారం మండల బలిజ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దక్షిణ భారతదేశాన్ని పాలించి ఆంధ్రభోజుడిగా ఖ్యాతి గాంచి, రాయలసీమ గొప్పతనాన్ని చాటిన ఆయన పాలన గురించి నాయకులు గుర్తు చేసుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, మండలాధ్యక్షుడు ఆకులనడిపి వెంకటసుబ్బయ్య, కోశాధికారి అర్జిగారి నరసింహులు, ఉపాధ్యక్షులు బల్లారి ఉసేనయ్య, కమతం చిన్న రాముడు, కార్యదర్శి కస్తూరి రామసుబ్బయ్య పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): పల్నాడు జిల్లా అమరావతి మండలం నెమలికల్లుకు చెందిన మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదే కాలనీకి చెందిన హజరత్ మస్తాన్ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడన్నారు. దివ్యాంగులపై దాడులు కొనసాగుతున్నా పోలీసులు చర్యలు చేపట్టక పోవడం దారుణమన్నారు. నాయకులు కిరణ్‌కుమార్, ఎల్లయ్య, సభ్యులు నబిరసూల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం


సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ

గోస్పాడు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో 1,129 మంది గ్రాడ్యుయేట్లు, 71మంది టీచర్లు ఉన్నట్లు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని, గ్రాడ్యుయేట్‌లకు, టీచర్లకు ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. శిరివెళ్ల సీఐ చంద్రబాబునాయుడు, గోస్పాడు ఎస్‌ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

16న హుండీ కానుకల లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో బైటిపేట శ్రీఆంజనేయ కోదండ రామస్వామి దేవస్థానం, మూలమఠం భీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16వ తేదీన హుండీ కానుకలను లెక్కిస్తామని ఈఓ రామాంజనేయ శర్మ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు భక్తుల సమక్షంలో బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానం, మధ్యాహ్నం 3 గంటలకు మూలమఠం శ్రీభీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనదల్చిన వారు ముందు రోజు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

యోగాతో మానసిక ఆరోగ్యం


ఎంపీ పోచాను సన్మానిస్తున్న యోగా సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహద పడతాయని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భరత మాత ఆలయం వీధిలోని యోగా చైతన్య సంస్థలో యోగాచార్యులు రాపర్తి రామారావు జయంతికి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రపంచానికి యోగా విద్యను అందించినది మన దేశమేనన్నారు. అనంతరం యోగా సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నరసింహరావు, సెక్రటరీ దామోదర కుమార్ రెడ్డి, యోగా గురువు దామోదర్‌రెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి, దీవీ హయగ్రీవాచారి, భవనాశి వాసు, మహేష్ పాల్గొన్నారు.

మహానందిలో సండే సందడి


మహానంది కోనేరులో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉగాది సమీపిస్తుండటంతో కన్నడ భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం అష్టవిధ మహామంగళహారతులతో ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది.

మహానందీశ్వర దంపతులకు ఏకాంతసేవ పూజలు

మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం రాత్రి ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ఏకాంతసేవ పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి,అమ్మవారి మూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక యాగశాలలో ప్రత్యేకంగా తయారు చేసిన మండపం వద్ద గణపతిపూజ, పుణ్యాహవాచనం, తదితర శాస్త్రోక్త పూజలు చేపట్టారు. పూజల అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నల్లమల అడవిలో అన్నదానానికి సన్నద్ధం


సరుకులు నిండిన వాహనాలతో భక్త బృందం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ లోని నాగలూటి వీరభద్ర ఆలయం వద్ద గత 17 సంవత్సరాలుగా ఉగాది వేడుకలకు అన్నదానం నిర్వహిస్తున్న శ్రీశైల మల్లికార్జున మల్టీపర్పస్ ట్రస్ట్ వారు మరోసారి మహా అన్నవితరణకు సర్వ సన్నద్ధమై అడవికి బయలుదేరి వెళ్లారు. ఆదివారం మహారాష్ట్ర లోని కొల్హాపూర్ జిల్లా ఇచ్చలకరంజికి చెందిన సుమారు 300 మంది కన్నడ భక్తులు నాలుగు లారీలలో సరుకులన్ని సమకూర్చుకుని అన్నదానా స్థలమైన నాగలూటి బయలు దేరి వెళ్లారు. ట్రస్ట్ సభ్యులు శిరీష్‌పాటిల్, పాండుల నేతృత్వంలో ఈ బృందం ఉగాది పర్వదినం వరకు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే లక్షలాది మంది శివభక్తులకు 24 గంటలు అన్నప్రసాదాన్ని అందుబాటులో ఉంచుతారు. చల్లటి మజ్జిగకూడా పంపిణీ చేస్తారు. అలాగే వైద్య సేవలను కూడా ఈ ట్రస్ట్ అందిస్తుంది.

లలితాంబికా వాణిజ్య సముదాయం తనిఖీ


దుకాణ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న ఈఓ ఎస్.లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో శ్రీలలితాంబికా వాణిజ్య సముదాయాన్ని దేవస్థానం ఈఓ ఎస్ లవన్న ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దుకాణదారులందరు తమకు కేటాయించిన స్థల పరిమితితోనే వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు. దుకాణ పరిధి దాటి ముందుకు రావడం వలన పాదచారులకు ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పారు. స్థలపరిమితి దాటి రహదారుల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఎప్పటికప్పుడు ఆక్రమణలను తొలగిస్తుండాలని రెవెన్యూ విభాగాన్ని ఆదేశించారు. దుకాణదారులు తమ దుకాణాలను ఇతరులకు సబ్ లీజుకు ఇవ్వరాదని సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వి.రామకృష్ణ, రెవెన్యూ పర్యవేక్షకులు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


దొర్నిపాడులో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న తహసీల్దారు,ఎస్‌ఐ.


ఉయ్యాలవాడలో బ్యాలెట్ బాక్సులను బస్సు నుంచి దించి పోలింగ్ కేంద్రానికి తరలిస్తున్న సిబ్బంది

రుద్రవరం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు గుంపులుగా తిరగరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరుగనుంది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 789 మంది పట్టభద్రులు, 39 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని కోరారు. వివిధ పార్టీల నాయకులు,ఏజెంట్లు తదితరులు పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను ప్రలోభ పరచడం, ఒత్తిడి చేయడం లాంటి వాటికి పాల్పడకుండా ఓటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

దొర్నిపాడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు,టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దారు జయప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు 530, ఉపాధ్యాయులు 19మంది ఓటు హక్కును సోమవారం వినియోగించుకోనున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపాల్ ఉన్నారు.

ఉయ్యాలవాడ : సోమవారం జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన సామగ్రి ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 687 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 21 మంది ఉన్నారు. వీరి కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేర్వేరుగా రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం పోలింగ్ కేంద్రానికి పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓఎస్‌లు, ఇద్దరు మైక్రో అబ్జర్వర్లను జిల్లా ఎన్నికల అధికారులు నియమించినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు.

ఆళ్లగడ్డ: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఆరు మండల కేంద్రాల్లో పట్టభద్రులకు 13, ఉపాధ్యాయ ఓటర్లకు 6 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం సంబంధిత పోలింగ్ కేంద్రాల పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు వారికి కేటాయించిన కేంద్రాలకు సామగ్రితో చేరుకున్నారు.


చాగలమర్రిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని శ్రీ సంకులమ్మ ఆలయం ఎదుట ఆదివారం పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేదపండితులు హోమాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ పాలెం చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, బాబు, రామచంద్రారెడ్డి, ఎల్లగౌడ్, చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

బాట సుంకులమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోవెలకుంట్ల: జోళదరాశి గ్రామ సమీపంలో వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాంమోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వ్యక్తిపై కత్తితో దాడి

డోన్ రూరల్ : స్థానిక పాతపేటకు చెందిన కృష్ణమూర్తి అనే వ్యక్తిపై ఆదివారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో కత్తితో దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణమూర్తిని అదే కాలనికి చెందిన బాలు అనే వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరడచడం జరిగిందన్నారు. స్థానికులు కృష్ణమూర్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన డాక్టర్‌లు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

18న వాహనాల వేలం

నందికొట్కూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 18న వేలం వేస్తునట్లు టౌన్ సీఐ విజయభాస్కర్ ఆదివారం తెలిపారు. 31 బైకులు, 3 ఆటోలు, 2 కార్లు వేలం వేస్తునట్లు చెప్పారు. పోలీసు స్టేషన్ వెనుకభాగంలో ఖాళీగా ఉన్న స్థలంలో వేలం పాట ఉంటుందన్నారు.

తప్పిన ప్రమాదం

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ప్రమాదం త్రుటిలో తప్పింది. మదనపల్లెకు చెందిన ఆరుగురు భక్తులు కారులో మహానంది వస్తుండగా ఆదివారం రాత్రి గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలోని బగ్గిరోడ్డు మలుపు వద్ద కారు అదుపుతప్పి మిరపతోటలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

విద్యార్థికి ఆర్థిక సాయం

నంద్యాల(వ్యవసాయం): నవనంది రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో ఆదివారం డిగ్రీ విద్యార్థి బి.కిరణ్‌కుమార్‌కు ఆర్థిక సాయాన్ని ఆదివారం స్థానిక కార్యాలయంలో అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ వెలుగోడు గ్రామానికి చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థి చదువు నిమిత్తం రూ.10,116ను రోటరీ సభ్యుడు వరద జనార్దన్ సహకారంతో అందజేశారన్నారు. కార్యదర్శి నవీన్, సుధాకర్, రాజేంద్ర, రామశేషు, దీపక్, శశిధర్, సునంద పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ పంపిణీ పూర్తి చేయాలి

ప్యాపిలి: నులిపురుగుల నివారణ చర్యల్లో భాగంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆయన ప్యాపిలి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఈ నెల 14 వ తేదీన 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కోసం క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ తినిపించుకుంటున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

నంద్యాల: వైఎస్సార్‌సీపీ 13వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని సంబరాలు చేసుకున్నారు. కార్యాలయ ఆవరణలో పార్టీ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న పార్టీని స్థాపించి, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడి పార్టీని అధికారంలోకి తెచ్చారన్నారు. ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ అభివృద్ధే అజెండాగా విలువలు, విశ్వసనీయతే నినాదంగా పార్టీ పురుడు పోసుకుందన్నారు. కార్యక్రమంలో పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, నాయకులు కల్లూరు రామలింగారెడ్డి, శశికళారెడ్డి, ఉప్పు జగన్‌ప్రసాద్, పాంషావలి, జాకీర్‌హుసేన్, దేవనగర్ బాషా, టీవీ రమణ పాల్గొన్నారు.

శిల్పా స్వగృహంలో..

ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి స్వగృహంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర డైరెక్టర్లు సునీత అమృతరాజ్, శశికళారెడ్డి, ఎంపీపీ ప్రభాకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్లు విజయశేఖర్‌రెడ్డి, సిద్ధం శివరాం, నాయకులు ప్రతాపరెడ్డి, అమృతరాజ్, కారురవి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పీపీ నాగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


ఆళ్లగడ్డలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే పేదల సంక్షేమం కోసం పాటుపడుతోందని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఎగరవేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పేదల సంక్షేమం కోసం పుట్టినపార్టీగా ఖ్యాతి దక్కించుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, షేక్ బాబులాల్, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నజీర్, నరసయ్య, గంగుల రామిరెడ్డి తదితరులున్నారు.